

నేటి నుంచి కల్యాణోత్సవాలు
» పాదగయలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
ప్రసాద్ స్కీం పనులకు రేపు శంకుస్థాపన - 5లో

మాట్లాడితే నా బీసీ.. నా బీసీ... అంటూ ఇన్నాళ్లు వారిని నిలువునా మోసం చేసిన జగన్ సర్కారుకు టీడీపీ, జనసేన కూటమి గట్టి షాక్ ఇచ్చింది. ఉమ్మడి డిక్లరేషన్ ప్రకటనతో వైసీపీ పాలనలో నలిగిపోయిన బీసీలకు సాంత్వన చేకూర్చేలా కీలక నిర్ణయాలు ప్రకటించింది. బీసీలను ఓట్ల కోసమే వాడుకుని వారిని ఐదేళ్లుగా అణగదొక్కిన జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా డిక్లరేషన్ ఆయుధాన్ని బయటకు వదిలింది. అధికారం చేతిలో ఉన్నా ఏదీ చేయకుండా బీసీలను మోసం చేసిన తీరును ఎండగట్టింది. తిరిగి అధికారంలోకి వచ్చాక పూర్వవైభవం తీసుకువస్తామని ఎలుగెత్తి చాటింది.

# స్వర్ణయుగమే

## 'వెన్నెముక'.. ఉండదు కష్టమిక

- టీడీపీ, జనసేన ఉమ్మడి బీసీ డిక్లరేషన్‌తో బీసీలకు మళ్లీ మంచిరోజులు
- వైసీపీ పాలనలో నలిగిపోయి చితికిపోయిన బీసీల్లో ఆనందోత్సాహాలు
- తిరిగి ఆదరణ పథకం ప్రారంభిస్తామన్న డిక్లరేషన్ ప్రకటనతో భరోసా
- రూ.4వేలకు పెన్షన్ పెంపు, 50ఏళ్లకే పెన్షన్.. ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామన్న హామీతో బీసీ కులాల్లో కొత్త ఉత్సాహం
- బీసీ భవనాలు, కమ్యునిటీ హాళ్లు పూర్తి చేస్తామనడంతో మళ్లీ పునరుజ్జీవం
- 1986 నుంచీ జరగని బీసీల కులగణనను చట్టబద్ధంగా చేస్తామని హామీ
- డిక్లరేషన్ అంశాలతో తిరిగి బీసీలకు మంచిరోజులు వచ్చినట్లేనంటూ చర్చ
- జిల్లాలో వైసీపీ ఐదేళ్ల పాలనలో అన్ని బీసీ పథకాలు రద్దు
- వచ్చీరాగానే ఆదరణ దరఖాస్తులు, పనిముట్లు కక్షతో మూలకు..
- ఓబీ ఎంఎంఎస్, ఎంబీసీ పథకాలన్నీ రద్దు చేసి బీసీలను అణగదొక్కిన జగన్
- బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లకు నిధులు నిలిపివేత, స్థలాలపై కన్నేసి కబ్జా




(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

వైసీపీ అటకెక్కించి కక్షతో రద్దు చేసిన అనేక కీలక సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేస్తామని చెప్పి జిల్లాలో బీసీల్లో టీడీపీ, జనసేన కూటమి ధైర్యం నింపింది. మళ్లీ మునుపటి స్వర్ణయుగాన్ని తెస్తామని చాటింది. ఆదరణ, బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం, కుల గుణన, స్థానిక సంస్థలు, నామినేటెడ్ పోస్టుల్లో రిజర్వేషన్లు, బీసీ భవనాల నిర్మాణం ఇలా అనేకకీలక అంశాలపై తన అజెండా ప్రకటించింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక బీసీలపై కక్షతో ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఆదరణ పథకం దరఖాస్తులు, సిద్ధంగా ఉన్న పనిముట్లను పక్కన పారేసింది. స్వయం ఉపాధికి ఊతమిచ్చే ఓబీ ఎంఎంఎస్, ఎంబీసీ పథకాలన్నీ రద్దు చేసేసింది. విదేశీ విద్య ఉపకారవేతనాల్లో కోత కోసేసింది. అన్నింటి స్థానంలో తూతూమంత్రంగా జగనన్న చేయూత పథకం ఒక్కటే అమలు చేసి ఏటా 13,314మందికి రూ.10వేల చొప్పున ఇచ్చి చేతులు దులిపేసుకుంది.

### మళ్లీ 'ఆదరణ' అమలు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1986 లెక్కల ప్రకారం.. 15.65లక్షల మంది బీసీలున్నారు. ఆ తర్వాతనుంచి ఇప్పటివరకు బీసీలకు సంబంధించి కులగణన జరగలేదు. దీంతో అన్నింటా సంక్షేమ పథకాలు, ఇతర రిజర్వేషన్లలో వీరంతా అన్యాయానికి గురవుతున్నారు. ఈ నేపథ్యం లో బీసీలకు వెన్నుముకగా పేరొందిన టీడీపీ తాజాగా బీసీ డిక్ల రేషన్ ప్రకటించడంతో జిల్లాలో బీసీలకు తిరిగి ఊపిరందినట్లయింది. ప్రస్తుత లెక్కల ప్రకారం అంచనాగా చూసినా ఉమ్మడి జిల్లాలో 19లక్షల80వేలమంది బీసీలు.. కాకినాడ జిల్లాలో 7లక్షల 40వేలమంది ఉంటారని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో టీడీపీ, జనసేన ప్రభుత్వం రాగానే చట్టబద్ధంగా కులగణన చేప డతామని ప్రకటించడంతో ఇన్నేళ్ల సమస్యకు పరిష్కారం దొరు కుతుందని హర్షం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధి కారంలోకి రాగానే రూ.5వేలకోట్లతో ఆదరణ పథకం ప్రారంభి స్తామని ప్రకటించడంతో తిరిగి బీసీల్లో ధైర్యం వచ్చినట్లయింది. గత టీడీపీ ప్రభుత్వం ఆదరణ-1, ఆదరణ-2 పథకం పేరుతో జిల్లాలో బీసీల్లో ఆయా కులాలవారీగా పలు వృత్తులకు సంబంధించిన కోట్ల విలువైన లక్షలాది పనిముట్లను అందించింది. రజకుల దగ్గరనుంచి కల్లుగీత కార్మికులు, నాయిబ్రాహ్మణులు ఇలా అనేకమందికి పనిముట్లను అందించి అండగా నిలబడింది. తీరా వైసీపీ అధికారంలోకి రాగానే ఆదరణ పథకాన్ని పూర్తిగా రద్దు చేసేసింది. అప్పటికే ఉమ్మడి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న వేలాదిమంది దరఖాస్తులను పక్కన పారేసింది. వీరంతా కట్టిన డబ్బులకు సంబంధించి జిల్లాకు చేరిన వేలాది కిట్లను మూలన పడేసింది. దీంతో బీసీలంతా తీవ్రంగా ఇబ్బంది పడ్డారు.

### కనిపించినవన్నీ కబ్జా చేసిన వైసీపీ

గత టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలో బీసీలకు ప్రతి నియోజకవర్గంలో బీసీ భవనాలు, కమ్యునిటీ హాళ్లు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి స్థలాలు, నిధులు కూడా విడుదలయ్యాయి. దోభీ ఘాట్‌ల నిర్మాణానికి కూడా రూ.లక్షల్లో నిధులు మంజూరయ్యాయి. కానీ వైసీపీ అధికారంలోకి రాగానే వీటి నిర్మాణాన్ని ఎక్కడికక్కడ నిలిపివేసింది. స్థలాలు మంజూరైన చోట వాటిని స్థానిక వైసీపీ నేతలు కబ్జా చేసేశారు. బీసీల్లో ఆయా సామాజికవర్గాల వారీగా కార్పొరేషన్లు, నిధులు, బీసీలకు నామినేటెడ్ పదవుల్లో రిజర్వేషన్లు ఇస్తామని డిక్లరేషన్‌లో పొందుపరచడంతో వైసీపీ పాలనతో తాము ఎలా నలిగిపోయామో గుర్తుచేసుకుని బీసీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పేరుకు బీసీలకు కొన్ని కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా చిల్లిగవ్వ కూడా నిధులు కేటాయించలేదు. దీంతో అవన్నీ అలంకారప్రాయంగా మారాయి. ఇప్పుడు డిక్లరేషన్ ద్వారా రిజర్వే షన్ అమలు చేస్తామని టీడీపీ చెప్పడంతో ఎందరో బీసీలకు పదవులు లభించనున్నాయి. బీసీల్లో ఉన్న అనేక ఉప కులాల్లో తక్కువ జనాభా ఉన్నవారికి, ఎన్నికల్లో పోటీ చేయలేని వర్గాలకు కోఆప్షన్ సభ్యులుగా అవకాశం ఇస్తామని చెప్పడంతో వారందరికీ తొలిసారిగా గుర్తింపు లభించే అవకాశం ఏర్పడింది. టీడీపీ పాలనలో జిల్లాలో బీసీలకు ముప్పైకి పైగా పథకాలు అమల్లో ఉండేవి. కానీ బీసీలను కేవలం ఓటర్లుగానే చూసిన వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇవన్నీ రద్దు చేసేసింది. జగనన్న చేయూత పథకం ఒక్కటే మహిళలకు అందుబాటులోకి తెచ్చింది. ఇందులోను రకరకాల కోతలు కోసి కాకినాడ జిల్లాలో ఏడాదికి 13,314మందికి, ఉమ్మడి తూ.గో. జిల్లాలో 36,177మందికి మాత్రమే ఏడాదికి రూ.పది వేలు ఇచ్చి మమ అనిపిస్తోంది.

### ప్రత్యేక రక్షణ చట్టంపై హర్షం

డిక్లరేషన్‌లో పేర్కొన్న విధంగా బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టంతో బీసీల్లో ఆనందం ఉప్పొంగుతోంది. వైసీపీ ఐదేళ్ల పాలనలో జిల్లాలో అనేక రకాల దాడులు జరిగాయి. కల్లుగీత కార్మికుల దగ్గరనుంచి నాయీబ్రాహ్మణులు, రజకులపై అధికారులు, వైసీపీ నేతలు జరిపిన దాడులకు లెక్కలేదు. ఈ నేపథ్యంలో ప్రత్యేక రక్షణ చట్టంతో బీసీలకు ఊరట లభించినట్లయింది. వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన పారిశ్రామిక ప్రోత్సాహకాలు తిరిగి అమలు చేస్తామని తాజాగా టీడీపీ, జనసేన డిక్లరేషన్‌లో పేర్కొనడంతో బీసీల్లో ఆనందం వ్యక్తమవుతోంది. తిరిగి తమకు పూర్వవైభవం వస్తుందనే ధీమాను వారంతా వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి గత టీడీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో బీసీలకోసం బీసీ కార్పొరేషన్ ద్వారా ఓబీ ఎంఎంఎస్ పథకాన్ని అమలు చేసింది. ఏదైనా వ్యాపారం చేసుకోవాలనుకుని ముందుకు వచ్చిన లబ్ధిదారులకు రూ.లక్ష సబ్సిడీ, మరో రూ.లక్ష లోన్ అందించి ఆర్థికంగా ఎదగడానికి తోడ్పడింది. ఎంబీసీ పథకం ద్వారా రూ.30వేలు అందించి వ్యాపారులు ప్రోత్సహించింది. జగన్ ప్రభుత్వం వచ్చాక ఇవన్నీ రద్దు చేసి పారేసింది. దీంతో ఆర్థికంగా నిలదొక్కుకుని స్వయం ఉపాధిపై నిలబడాలనుకున్న బీసీలంతా రోడ్డున పడ్డారు. బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్లను ఏడాదిలోగా నిర్మిస్తామన్న డిక్లరేషన్ ప్రకటనతో బీసీలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### వెనుకబడిన వర్గాలకు సంజీవని



**కాకినాడ సిటీ:** టీడీపీ ప్రకటించిన బీసీ డిక్లరేషన్ వెనుకబడిన వర్గాలకు సంజీవని లాంటిది. టీడీపీ-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 34శాతం బీసీ రిజర్వేషన్లు పునరుద్ధరించనుంది. జగన్‌రెడ్డి రద్దు చేసిన పారిశ్రామిక ప్రోత్సాహకాలను, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరించనుంది..

**-వనమాడి కొండబాబు, మాజీ ఎమ్మెల్యే, కాకినాడ సిటీ**

### బీసీలకు వరం లాంటిది..



**ప్రత్తిపాడు:** బీసీడిక్లరేషన్ బీసీలకు ఒక వరం లాంటిది. బీసీలకు 50ఏళ్లకు పెన్షన్, రూ.4వేలు, బీసీ రక్షణకు ప్రత్యేకచట్టం వంటివి బీసీలపట్ల టీడీపీ, జనసేనల చిత్తశుద్ధి స్పష్టం చేస్తోంది. చట్టబద్ధంగా కుల గణన నిర్ధారణ, బీసీల విద్యా పథకాల పునరుద్ధరణ, బీసీ భవనాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణాలు, బీసీలకు ఉపాధి వంటివి పొందుపరచడం వల్ల బీసీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**-మదినే దొరబాబు, టీడీపీ బీసీ సెల్ అధికారి ప్రతినిధి**

### వైసీపీలో బీసీలను అణగదొక్కారు



**గండేపల్లి:** వైసీపీ బీసీలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెడతామని మోసం చేసి అన్ని విధాలా అణగదొక్కింది. టీడీపీ హయాంలో బీసీలకు 50శాతం పథకాలు అమలయ్యేవి. వైసీపీ వచ్చాక వాటిని 24కి కుదించారు. యాదవ కార్పొరేషన్‌ను రద్దు చేశారు. బీసీలకు దేవదాయశాఖ గుళ్లల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేశారు.

**-దుర్గాప్రసాద్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం మండల ఉపాధ్యక్షుడు**

### 'ఆదరణ' పునరుద్ధరణ ఆనందదాయకం



**సామర్లకోట:** బీసీ కులాలకు టీడీపీ హయాంలో దోహదపడిన ఆదరణ పథకం పునరుద్ధరణ చేస్తామనడం ఆనందదాయకం. ఇది బీసీకులాలకు చెందిన అన్నివర్గాల కుటుంబాలకు ఆర్థికంగా మేలు కలిగించే బృహత్తర పథకం. చట్టసభల్లో బీసీ కులాలకు 33శాతం రాజకీయ రిజర్వేషన్లపై హర్షాతిరేకాలు వెల్లువెత్తుతున్నాయి.

**-చీకట్ల వెంకటేష్, సర్పంచ్, పనసపాడు, సామర్లకోట మండలం**

### బీసీ సబ్‌ప్లాన్ ఎంతో మేలు



**ఏలేశ్వరం:** బీసీ సబ్‌ప్లాన్ పథకాన్ని వైసీపీ ప్రభుత్వం నీరుగార్చింది. టీడీపీ, జనసేన కూటమి అధికారంలోకి వచ్చాక రూ.లక్షన్నర కోట్లు వెచ్చిస్తామని ప్రకటించడం హర్షణీయం. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు పెంచుతామనడం శుభపరిణామం.

**-ధనేకుల వీరభద్రరావు, సిరిపురం, ఏలేశ్వరం మండలం**

### 'ఆదరణ' ప్రతిష్ఠాత్మకం..



**ఏలేశ్వరం:** టీడీపీ ప్రభుత్వం ఆదరణ పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసింది. వైసీపీ ప్రభుత్వం ఈ పథకాన్ని రద్దు చేయడంతో బీసీల్లోని ఎన్నో ఉపకులాలకు ఎంతో నష్టం ఏర్పడింది.

**-వైభోగుల సుబ్బారావు, ఏలేశ్వరం**



సిద్ధం సభ మధ్యలోనే వెనుదిరుగుతున్న మహిళలు

## ప్రత్తిపాడులో పేలవంగా వైసీపీ సిద్ధం సభ

- స్టేజీపై యువతుల నృత్యాలు.. వెనుదిరిగిన మహిళలు

ప్రత్తిపాడు, మార్చి 5: ప్రత్తిపాడులో వైసీపీ నియోజకవర్గ స్థాయి సిద్ధం సభ మంగళవారం పేలవంగా సాగింది. దీనికి నియోజకవర్గంలోని ప్రత్తిపాడు, ఏలేశ్వరం, రౌతులపూడి, శంఖవరం మండలాలనుంచి కార్యకర్తలను తరలించారు. ప్రతి గ్రామం నుంచి డ్వాక్రా మహిళలు సిద్ధం సభకు తరలివచ్చేలా ఆటోలు, వాహనాలు ఏర్పాటు చేశారు. వైసీపీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల సుబ్బారావు, కాకినాడ పార్లమెంట్ వైసీపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్సీ అనంతబాబు, జక్కంపూడి గణేష్, మరికొందరు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు వేదికపై ఆశీనులయ్యారు. సభావేదికపై యువతుల రికార్డింగ్ డ్యాన్స్‌లు మాదిరిగా నృత్యాలు చేయడంతో సమావేశానికి తరలివచ్చిన మహిళలు వెనుదిరిగారు. ఇది సమావేశమా లేక డ్యాన్స్ ప్రోగ్రామా అంటూ పలువురు విమర్శించారు. మహిళామణులు యువతుల డ్యాన్స్‌లను అసహ్యించుకుంటూ కుర్చీలు ఖాళీ చేశారు. కాగా ఎన్నికల హామీ నూరుశాతం సీఎం జగన్మోహన్‌రెడ్డి అమలు చేశారని మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు తెలిపారు. పార్లమెంట్ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పరుస్తామని వైసీపీ పార్లమెంటరీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్ తెలిపారు.

## 9న ప్రత్తిపాడులో బాబు బహిరంగ సభ వాయిదా

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, మార్చి 5: ఈనెల 9న ప్రత్తిపాడులో జరగాల్సిన టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగ సభ వాయిదా పడిందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఈ మేరకు జగ్గంపేట మండలం ఇర్రిపాక శివాలయంవద్ద మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్తిపాడులో ఏర్పాటు చేసిన బహిరంగ సభ మళ్లీ ఎప్పుడు జరిగేదీ త్వరలోనే తెలియజేస్తామని ఆయన తెలిపారు. ఈనెల 10న మధ్యాహ్నం 2గంటలకు జగ్గంపేట పరిణయ ఫంక్షన్ హాల్‌లో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఆ రోజు ఎన్నికలకు సంబంధించి ఇరుపార్టీల ఉమ్మడి కార్యాచరణకు సంసిద్ధమవుతామని తెలిపారు. కార్యక్రమంలో గండేపల్లి మండల తెలుగు రైతు అధ్యక్షుడు క్లస్టర్ ఇన్‌చార్జ్ అడబాల భాస్కరరావు, గోకవరం మాజీ ఎంపీపీ డీవీ సూర్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు బదిరెడ్డి అచ్చన్నదొర, మలిరెడ్డి సిరి, దాసరి సీతారామకృష్ణ, మండపాక అప్పన్నదొర, యల్లమిల్లి సీఎం, బదిరెడ్డి నాగ సూర్య సత్యనారాయణ పాల్గొన్నారు.

## భిక్షాటన బాలలను గుర్తించేందుకు స్పెషల్‌డ్రైవ్

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 5: జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి కె.ప్రవీణ సూచనల మేరకు జిల్లా బాలల పరిరక్షణ అధికారి సీహెచ్ వెంకటరావు ఆధ్వర్యంలో భిక్షాటన చేస్తున్న బాలలను గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీస్, విద్యాశాఖ, కార్మికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో ముగ్గురు భిక్షాటన తల్లులతో చేస్తున్న బాలలను, ఒక బాలకార్మికుడిని గుర్తించామన్నారు. తల్లులకు కౌన్సెలింగ్ ఇచ్చి పునరావృతం కాకుండా లిఖితపూర్వకంగా అంగీకార పత్రం రాయించి అప్పగించారు. బాలలతో భిక్షాటన చేయిస్తే ఐదేళ్ల జైలుశిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశముందని తెలిపారు. డీసీపీవో వెంకటరావు, చైల్డ్ వెల్ఫేర్ సభ్యురాలు జంగా సంతోషకుమారి, సర్వశిక్ష అభియాన్ కోఆర్డినేటర్ హరికృష్ణ, కార్మికశాఖ అధికారి సత్యనారాయణ, బాలల పరిరక్షణ సిబ్బంది శ్రీనివాస్, విజయ, సుధాకర్, దుర్గారాణి పాల్గొన్నారు.

# సాగునీటి కష్టాలు.. అనంతం

- ఏలేరు ఆయకట్టు పరిధిలో శివారు ప్రాంతాలకు అందని సాగునీరు
- ఎండిపోతున్న దాళ్వా వరిపంట
- రైతుల్లో సమన్వయం లేకపోవడమే కారణమంటున్న అధికారులు
- ఇరిగేషన్ తీరుపై రైతుల మండిపాటు

పిఠాపురం, మార్చి 5: దాళ్వా సాగుకు నీటికష్టాలు తప్ప డం లేదు. శివారు ప్రాంతాలకు నీరందక వరిపంట ఎండి పోతోంది. పలుచోట్ల పొలాలు బీటలు వారాయి. సాగునీరు అందించాల్సిన ఇరిగేషన్, వ్యవసాయశాఖల అధికారులు మాత్రం రైతుల్లో సమన్వయం లేకపోవడంతో నీరందించలేకపోతున్నామని కొత్తభాష్యం చెబుతున్నారు. అధికారుల తీరుపై రైతులు మండిపడుతోంది. సాగునీటి సరఫరాలో తమ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలేరు ఆయ కట్టులోని శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. రైతులు ఆందోళనలకు దిగినా పరిస్థితిలో మార్పు లేదు. కళ్లెదుటే పంట ఎండిపోతుండడం, పొలాలు బీటలు వారుతుండడం చూసిన రైతులు ఆవేదనకు గురవుతున్నారు. రిజర్వాయర్‌నుంచి విడుదలవుతున్న నీటిని శివారు వరకూ సరఫరా అయ్యేలా చూడడంతో ఇరిగేషన్ అధికారులు వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. గ్రామాలవారీగా కమిటీలు వేశామని అధికారులు చెబుతున్న మాటలు ఆచరణలో ఎక్కడా కనిపించడం లేదు.

### నెలరోజులుగా అందని నీరు

ఏలేరు శివారు ఆయకట్టు ప్రాంతాలుగా ఉన్న పిఠాపురం మండలంలోని బి.ప్రత్తిపాడు, భోగాపురం, రాపర్తి, రాయవరం తదితర గ్రామాలతో పాటు గొల్లప్రోలు పట్టణంలోని ప్రాంతాలకు నెలరోజులుగా ఏలేరు నీరు అందడం లేదు. వంతు సమయంలోను నీరు రాకపోవడంతో ఏం చేయాలో తెలియని స్థితిలో రైతులు ఉన్నారు. ప్రస్తుతం దాళ్వా వరిపంట పొట్ట దశలో ఉంది. ఈ సమయంలో సాగునీరు అత్యంత అవసరం. నీరు లేకుంటే గింజ పొల్లుగా మారే ప్రమాదం ఉంది. ఇటువంటి తరుణంలో సాగునీటి సమస్య ఏర్పడడంతో రైతులు కలవరానికి గురవుతున్నారు. ప్రస్తుతం ఈ గ్రామాల్లో పంట ఎండిపోతోంది. 500 ఎకరాల్లో పంట ఎండిపోయే దశకు చేరడంతోపాటు పొలాలు బీటలు వారాయి. మరో 4వేల ఎకరాల్లో పంటకు నీటి ఎద్దడి ప్రారంభమైంది. సాగునీరు అందించాలని రైతులు కోరుతున్నా ఇరిగేషన్ అధికారుల్లో స్పందన కొరవడంతో ఆగ్రహానికి గురైన పి.దొంతమూరు, వెల్దుర్తి గ్రామాల రైతులు కిర్లంపూడి ఇరిగేషన్ కార్యాలయం వద్ద వంటావార్పు నిర్వహించారు. అధికారుల్లో కదలిక వచ్చినా నీరు మాత్రం పొలాలకు చేరలేదు. పీబీసీ పరిధిలోని శివారు ప్రాంతాల్లో ఇదే విధమైన సమస్య నెలకొంది.



పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో ఎండిపోతున్న దాళ్వా వరి పంట

### బాధ్యతను విస్మరించి.. రైతులపై నెపం వేస్తూ..

సాగునీటి సమస్య తీవ్రతరం కావడంతో జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు కొద్దిరోజుల క్రితం జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్, ఇరిగేషన్ ఈఈ రామగోపాల్ తదితరులు నీటిఎద్దడి ఉన్న ప్రాంతాల్లో పర్యటించారు. పొలాలకు ఎలా సాగునీరు అందించాలి అన్న అంశంపై పరిశీలనను మరిచిపోయి, ఏలేరు ప్రాజెక్టునుంచి నీరు విడుదలవుతున్నా రైతుల్లో సమన్వయం లేకపోవడంవల్లే పంటకు నీరందడం లేదనే వాదనను తెరపైకి తెచ్చారు. అసలు కాలువలకు నీరు వస్తే సాగునీటి సమస్య ఎందుకు వస్తుందన్న అంశాన్ని వారు విస్మరించారు. గ్రామాల్లో రోడ్డుపై నుంచే తమ పరిశీలన ముగించి గ్రామాలవారీగా కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పి వారు చేతులు దులుపుకున్నారు. కమిటీల ఏర్పాటు కాగితాలకే పరిమితమైంది. సాగునీటి కష్టాలు తీరలేదు.

### నీరందకుంటే పంటను కోల్పోయినట్లే..

మరో రెండు, మూడు రోజుల్లో సాగునీరు అందకుంటే వరి పంటను కోల్పోతామని బి.ప్రత్తిపాడు, భోగాపురం తదితర గ్రామాలకు చెందిన రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పంటపై ఎకరానికి రూ.25వేల వరకూ పెట్టుబడులు పెట్టామని వారు తెలిపారు. ఇప్పటికే పొలాలు బీటలు వారి పంట ఎండిపోయే స్థితికి చేరుకుందని చెప్పారు. ఇటువంటి తరుణంలో నీరందకుంటే పంట ఎండిపోతోందని, పొట్టదశలో ఉన్న పంటలో గింజ పొల్లుబారి దిగుబడులు గణనీయం తగ్గుతాయని వారు ఆందోళన చెందుతున్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఏలేరు శివారు ఆయకట్టుకు సాగునీరు అందడంలో ఎక్కడ సమస్య ఉందో గుర్తించాలని రైతులు కోరుతున్నారు.

### అసలు సమస్య ఇక్కడే..

ఏలేరు ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీటిని ఎగువ ప్రాంతాల్లో అడ్డుకట్టలు వేసి మళ్లించడంతో శివారు ప్రాంతాలకు సాగునీరు అందడం లేదు. వంతు సమయాల్లో కూడా నీరు కిందకు రాకుండా చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. ఏలేరు ఆయకట్టుకు సాగునీరందక వరిపంట ఎండిపోతుండగా ఇక్కడకు నీరివ్వకుండా ఏలేరు నీటిని పీబీసీ ఆయకట్టుకు మళ్లించడం విమర్శలకు గురవుతోంది. అధికార పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధి మెప్పుకోసం నీటిని మళ్లించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. రిజర్వాయర్‌లో విడుదలైన నీటిని ముందుగా శివారు ప్రాంతాలకు అందించడం ద్వారా సమస్యకు పరిష్కారం చూపే అవకాశమున్నా అధికారులు ఆ దిశగా ప్రయత్నించడం లేదని వారు మండిపడుతున్నారు.

## పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగంపై అవగాహన

కాకినాడ సిటీ, మార్చి 5: భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలను పాటిస్తూ ఎన్నికల నిర్వహణ సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అవగాహన, ఏర్పాట్లు పటిష్ఠంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. రానున్న లోక్‌సభ, అసెంబ్లీ సాధారణ ఎన్నికలు-2024 నిర్వహణ ప్రక్రియలో పాల్గొనే పోలింగ్ అధికారులు, సిబ్బంది, సర్వీస్ ఓటర్లకు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా వృద్ధులు, వికలాంగులకు, హోమ్ ఓటింగ్ ద్వారా ఓటు హక్కు కల్పన అంశంపై మంగళవారం కాకినాడ కలెక్టరేట్ విధాన గౌతమీ సమావేశ మందిరంలో ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, నోడల్ అధికారులు, వివిధ శాఖల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కృతికా శుక్లా, జాయింట్ కలెక్టర్ సీవీ ప్రవీణ్ ఆదిత్య హాజరై పోస్టల్ పోల్ మేనేజ్మెంట్, పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులైన అధికారులు, సిబ్బంది డేటా, ఫెసిలిటీ సెంటర్ నిర్వహణ, ఫారం-12, 12డి, బ్యాలెట్ పేపర్, సర్వీస్ ఓటర్లకు ఈ పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై ఎన్నికల కమిషన్ జారీ చేసిన విధివిధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో పాల్గొనే అధికారులకు, సర్వీస్ ఓటర్లకు, ఎసెన్షియల్ సర్వీసెస్ అందించే సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు.

కమిషన్ నిర్దేశించిన సూచనలకు అనుగుణంగా ఈ సదుపాయాన్ని రానున్న సాధారణ ఎన్నికల సందర్భంగా జిల్లాలో అర్హులైన సిబ్బంది అందరికీ కల్పించాలన్నారు. మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్లు జారీ చేసి, రెండో విడత శిక్షణ కార్యక్రమంలో పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ నిర్వహించాలని జేసీ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి.తిప్పే నాయక్, అదనపు ఎస్పీ జేఎస్పీ భాస్కరరావు, కాకినాడ కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిషోర్, జె.సీతారామారావు, డీఎంహెచ్‌వో జె.నరసింహనాయక్, జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసు, ట్రాన్స్‌కో ఈఈ ప్రసాద్, కాకినాడ, పెద్దాపురం డీఎల్డీవోలు పి.నారాయణమూర్తి, కేఎస్ఎస్వీ ప్రసాద్‌రాజు, ఇతర శాఖల అధికారులు, ఏఈఆర్వోలు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

## శివరాత్రికి ప్రత్యేక బస్సులు

కార్పొరేషన్(కాకినాడ), మార్చి 5: ఈనెల 8వతేదీ మహాశివరాత్రి సందర్భంగా జిల్లాలోని కాకినాడ, తుని, ఏలేశ్వరం డిపోలనుంచి కోటిపల్లి, ద్రాక్షారామ, పిఠాపురం, సామర్లకోట క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. కాకినాడనుంచి జి.మూలపొలానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామన్నారు. ఈ బస్సులు ఈనెల 7వతేదీరాత్రి నుంచి 8న అర్ధరాత్రి వరకు నడుస్తాయన్నారు.

## రేపు రసాయనిక విపత్తులపై మాక్‌ఎక్సర్‌సైజ్

కార్పొరేషన్(కాకినాడ), మార్చి5: ఈనెల 7న పరిశ్రమల్లో రసాయనిక విపత్తుల నియంత్రణపై మాక్‌ఎక్సర్‌సైజ్ నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డి.రాధాకృష్ణ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 22 పరిశ్రమల్లో నిర్వహిస్తున్న ఈ విన్యాసాల్లో భాగంగా జిల్లాలోని రెండు పరిశ్రమల్లో ఈ ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. కాకినాడ రూరల్ మండలంలోని తమ్మవరంలో ఎస్‌సీఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమలో మోటార్‌స్పిరిట్ ఓవర్‌ఫ్లో విపత్తు నియంత్రణ, సామర్లకోట మండలం పనసపాడు దేవీఫిషరీస్‌లో అమ్మోనియా వాయువు లీకేజీ విపత్తు నియంత్రణ అంశాలపై జరుగుతుందని వివరించారు. మాక్‌ఎక్సర్‌సైజ్‌పై స్థానిక ప్రజలు ఎటువంటి అపోహలు, ఆందోళనలకు గురికావద్దన్నారు.

## నేడు భీమేశ్వరుని కల్యాణం







సామర్లకోట, మార్చి 5: కాకినాడ జిల్లా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రారంభాన్ని పురస్కరించుకుని బుధవారం విఘ్నేశ్వర పూజ, అంకురారోపణ, దీక్షా ధారణలో పూజలు ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం స్వామి వారు, అమ్మవార్ల దేవతామూర్తులను నంది వాహనంపై అలం కరించి గ్రామోత్సవం నిర్వహిస్తారు. రాత్రి 8.10 గంటలకు ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం జరగనుంది. అన్నవరం సత్యదేవుని ఆలయ ప్రధాన అర్చకుల పర్యవేక్షణలో ఘనంగా కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బళ్ళ నీలకంఠం తెలిపారు.

## నేటి నుంచి కల్యాణోత్సవాలు

- పాదగయలో ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు




పిఠాపురం, మార్చి 5: కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో వేంచేసి ఉన్న రాజరాజేశ్వరీ సమేత ఉమాకుక్కుటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా తొలిరోజు బుధవారం వివిధ ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటలకు కుక్కుటేశ్వర స్వామికి, రాజరాజేశ్వరీ అమ్మవారికి పంచామృత స్నానం, ఉదయం 9 గంటలకు అంకురార్పణం-ధ్వజారోహణం ఉదయం 11 గంటలకు కుక్కుటేశ్వరస్వామికి లక్ష బిల్వార్చన, రాజరాజేశ్వరి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, లక్షపత్రిపూజ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు స్వామి, అమ్మవార్లకు పెండ్లికుమారుడు, కుమార్తె అలంకారం, సాయంత్రం 5 గంటలకు గజవాహనంపై గ్రామోత్సవం, 6 గంటలకు రామకృష్ణ వాసవి కన్యకా పరమేశ్వరీ కల్యాణ మండపం వద్ద ఎదురుసన్నాహం, రాత్రి 8.32 గంటలకు స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నారు.

## రెండు బైక్‌లు ఢీ

**ఇద్దరి మృతి..ఒకరి పరిస్థితి విషమం**


గౌతమ్


లక్ష్మణ్

కాట్రేనికోన, మార్చి 5: కాట్రేనికోన మండలం పల్లంకుర్రు పంచాయతీ పరిధిలో వడ్డివారిపేట సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మరణించారు. మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. పల్లంకుర్రుకు చెందిన కస్నీడి లక్ష్మణ్ (20), సూర్యతేజ బలుసుతిప్ప నుంచి వస్తూ ఎదురుగా భార్యతో వస్తున్న స్థానిక వైద్యుడు మట్టా సిద్ధార్థగౌతమ్(56) వాహనాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో లక్ష్మణ్ అక్కడికక్కడే మృతి చెందగా తీవ్రంగా గాయపడిన గౌతమ్, ఆయన భార్య మణిను స్థానికులు కాట్రేనికోన పీహెచ్‌సీకి తరలించారు. అనంతరం కాకినాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సిద్ధార్థగౌతమ్ మంగళవారం మరణించారు. ఆయన భార్య పరిస్థితి కూడా విషమంగానే ఉన్నట్టు, సూర్యతేజ సురక్షితంగానే ఉన్నట్టు తెలిసింది.

## ప్రసాద్ స్కీం పనులకు రేపు శంకుస్థాపన

అన్నవరం, మార్చి 5: కేంద్ర ప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం ద్వారా అన్నవరం ఆలయానికి రూ.20 కోట్లు మంజూరవడంతో దీనికి సంబంధించిన పనులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈనెల 7న వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. దీనికి సంబంధించి అన్నవరం దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతోంది. రామాలయ ప్రాంగణంలో సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు పనుల ప్రారంభం కార్యక్రమాన్ని తిలకించేలా భారీ స్క్రీన్ ఏర్పాటు చేస్తున్నారు. రూ.20 కోట్లతో టీటీడీ సత్రం వద్ద అన్నదాన నూతన భవనం, క్యూ కాంప్లెక్స్, ప్రకాష్‌సదన్ వెనుక భాగంలో భక్తులకు టాయిలెట్స్, ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు తదితర వాటికి వినియోగించనున్నారు. స్వామివారి వ్రతకథను హిందీలోకి అనువదించాలని ఎప్పటినుంచో ప్రయత్నాలు జరుగుతున్నా నేటికి అమలులోకి రాలేదు. త్వరలో ఈ దిశగా ప్రయత్నాలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## లారీ ఢీకొని యువకుడి మృతి


మృతిచెందిన జేమ్స్‌బాబు

రాజమహేంద్రవరం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ద్రాక్షారామ మండలం ఉంటూరుకు చెందిన డి.జేమ్స్‌బాబు (25) రాజమహేంద్రవరంలోని ఐసీఐసీఐ బ్యాంకులో పని చేస్తుంటాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో తన బైక్‌పై విధులకు వస్తున్నాడు. మోరంపూడి జంక్షన్ వద్దకు చేరుకునే సరికి లారీ వేగంగా ఢీకొట్టడంతో కింద పడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో ఘటనా స్థలంలోనే ప్రాణాలు విడిచాడు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## 25 టన్నుల రేషన్‌బియ్యం పట్టివేత


ఆలమూరు: రేషన్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు

అమలాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి)/ఆలమూరు: రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ రీజనల్ ఎస్పీ కేఎస్ఎస్వీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు ఆలమూరులో మంగళవారం తనిఖీలు చేపట్టారు. కల్యాణ చక్రవర్తి వే బ్రిడ్జి సమీపంలో అశోక్ లేలాండ్ లారీని రాజమహేంద్రవరం విజిలెన్స్ సీఐ టి.శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో విజిలెన్స్, రెవెన్యూ సివిల్ సప్లయిస్ అధికారులు తనిఖీ చేశారు. 460 తెలుపు రంగు ప్లాస్టిక్ బస్తాలు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌కు చెందిన 40 గోనె సంచులు.. మొత్తం 500 బస్తాల్లో సుమారు 25 వేల కిలోల పీడీఎస్ బియ్యం తరలిస్తున్నట్టు గుర్తించారు. కృష్ణా జిల్లా పామర్రుకు చెందిన శ్రీగౌతమి రైస్ అండ్ ఆక్వా ఎక్స్‌పోర్ట్స్ యజమాని గొట్టిపు రమేష్‌బాబు నుంచి పీడీఎస్ బియ్యాన్ని కాకినాడకు చెందిన వి.శ్రీనివాసరావుకు సరఫరా చేస్తున్నట్టు డ్రైవర్ పెద్దిరెడ్డి రాజేష్ అధికారులకు తెలిపారు. సుమారు రూ.21.37 లక్షల విలువైన పీడీఎస్ బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి 6(ఎ) కేసు నమోదు చేసి క్రిమినల్ కేసు కోసం పోలీస్‌స్టేషన్‌కు సిఫార్సు చేసినట్టు అధికారులు తెలిపారు. బియ్యాన్ని ఆలమూరు ఎంఎస్‌వోకు అప్పగించగా మండపేట ప్రభుత్వ గోదాముకు తరలించారు. లారీని ఆలమూరు పోలీసులకు అప్పగించారు. ఆలమూరు ఎస్ఐ శ్రీను నాయక్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు శ్రీనివాసరెడ్డి, భార్గవమహేష్, అలీషా, రెవెన్యూ, సివిల్ సప్లయిస్ అధికారులు పాల్గొన్నారు.

### 20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

కొవ్వూరు, మార్చి 5: అక్రమంగా తరలిస్తున్న 20 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహశీల్దార్ జి.బాపిరాజు తెలిపారు. ఉండ్రాజవరం నుంచి కాకినాడ పోర్టుకు లారీలో అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం రావడంతో సివిల్ సప్లయిస్ అధికారులు మంగళవారం తెల్లవారుజామున దాడులు చేశారు. కొవ్వూరు ఏషియన్ పెయింట్స్ గొడౌన్ సమీపంలో నేషనల్ హైవేపై లారీని సీజ్‌చేసి, లారీలో ఉన్న 20 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. కాకినాడ జిల్లా కరపకు చెందిన లారీ డ్రైవర్ రాయుడు బాలాజీ, లారీ యజమాని నల్లా శివ, తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం గ్రామానికి చెందిన బియ్యం యజమాని బాషా 6ఎ కేసు నమోదు చేసినట్టు బాపిరాజు చెప్పారు.

## ఘనంగా వైద్యనాదేశ్వరస్వామి కల్యాణం


హోమంలో పాల్గొన్న జ్యోతుల నెహ్రూ కుటుంబ సభ్యులు

జగ్గంపేట, మార్చి 5: కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం ఇర్రిపాకలో కోటిపార్థివ లింగ మహా రుద్రాభిషేకం దిగ్విజయంగా కొనసాగుతోంది. మంగళవారం విఘ్నేశ్వర పూజ, పరిషత్ పంచగవ్యప్రాసన, గోపూజ, రుద్రాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, లలిత హోమం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. జ్యోతుల నెహ్రూ మణి, జ్యోతుల నవీన్ లక్ష్మీదేవి, తోట సర్వారాయుడు, సునీత దంపతులు పీటలపై కూర్చుని వైద్యనాదేశ్వర స్వామి వారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్థివ లింగం మహారుద్రాభిషేకంలో పాల్గొన్న శ్రీ విజయ రాజరాజేశ్వరి శ్రీ విద్యా పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ వాసుదేవానందగిరి స్వాములు, శ్రీ విద్యాపీఠం పెదపులిపాక విజయవాడకు చెందిన పరమహంస పరివ్రాజకాచార్య హాజరై మహారుద్రాభిషేకంలో పాల్గొన్నారు. స్పెషల్ పోలీస్ ఎస్పీ కొండ నరసింహారావు , అతివేలు మంగాదేవి దంపతులు శంఖారావంతో భక్తులను ఆకట్టుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డొక్కా సీతమ్మ మనవడు డొక్కా నాథ్‌బాబు, గోకవరం మండలం మాజీ ఎంపీపీ డీవీ సూర్యనారాయణ, కొత్త కొండబాబు, జీను మణిబాబు, అడబాల వెంకటేశ్వరరావు, సుంకవిల్లి రాజు, బదిరెడ్డి అచ్చన్నదొర, దాసరి సీతారామకృష్ణ, అడబాల భాస్కరరావు, మలిరెడ్డి సిరి, వేముల కొండ జోగారావు, యల్లమిల్లి సీఎం, వేలాదిగా భక్తులు పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు.

## గుంతల రోడ్డుపై ప్రయాణం నరకం

- అధ్వానంగా రాజమండ్రి-భద్రాచలం రహదారి
- నిత్యం ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- కీలకమైన రహదారికి మరమ్మతులు చేయకుండా గాలికొదిలేసిన వైనం


అధ్వానంగా ఉన్న రోడ్డు

మోతుగూడెం, మార్చి 5: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న తులసిపాక వ్యూ పాయింట్ ఘాటీ నుంచి కనకదుర్గమ్మ ఆలయం వరకు రోడ్లు గుంతలతో అధ్వాన్నంగా ఉన్నాయి. రాజమండ్రి కాకినాడ వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏజెన్సీ పర్యటనకు వచ్చిన వారు ఈ రోడ్డును చూసి భయభ్రాంతులకు గురవుతున్నారు. అసలే ఘాటీ. రోడ్డు గుంతల వల్ల వాహనాలు ఆగిపోతే పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు. ఈ గోతుల్లో పడి వాహనదారులు పలు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయాల్లో ప్రయాణించాలంటే ప్రాణాలు గుప్పెట్లోనే పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. ఈ మార్గంలో కాకినాడ భద్రాచలం, రాజమండ్రి భద్రాచలం ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ మార్గం గుండా సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిసాలోని వివిధ ప్రాంతాలకు పలు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా ఒక్కో సమయంలో వాహనాలు నిలిచిపోతున్నాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. ఈ మార్గంలో మెరుగైన వైద్యం కోసం డొంకరాయి, చింతూరు నుంచి కాకినాడ వెళ్లాలంటే అంబులెన్స్ డ్రైవర్లు హడలిపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఈ రహదారికి మరమ్మతులు చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

## నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం


విరాళం అందిస్తున్న దాతలు

అయినవిల్లి, మార్చి 5: పి.గన్నవరం మండలం వాడ్రేవుపల్లికి చెందిన పట్నాల దత్తాత్రేయ దంపతులు మంగళవారం అయినవిల్లి శ్రీ విఘ్నేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నిత్యాన్నదాన పథకానికి రూ.1,11,116 విరాళాన్ని చెక్కు రూపంలో ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబుకు అందజేశారు. దాతలకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించి శేష వస్త్రంతో సత్కరించగా చైర్మన్ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేసి అభినందించారు.

## చోరీలకు పాల్పడుతున్నారని..

**పిఠాపురంలో ముగ్గురికి దేహశుద్ధి**

పిఠాపురం, మార్చి 5: చోరీలకు పాల్పడుతూ స్థానికుల చేతికి చిక్కారు ముగ్గురు వ్యక్తులు. కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని కుంతీమాధవస్వామి దేవస్థానంలో పనిచేసే దుర్గ అనే మహిళ ఇంట్లోకి ముగ్గురు వ్యక్తులు ప్రవేశించి దొంగతనానికి ప్రయత్నించారు. ఇది గమనించిన స్థానికులు వారిని పట్టుకుని దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. పోలీసులు వారిని విచారిస్తున్నారు. వీరు పట్టణానికి చెందిన వ్యక్తులా లేక ఇతర ప్రాంతాలకు చెందిన వారా అని ఆరా తీస్తున్నారు.

## షోరూంలో అగ్నిప్రమాదం




అమలాపురం టౌన్, మార్చి 5: అమలాపురం కళాశాల రోడ్డులోని గోఖలే సెంటర్లో వాసంశెట్టి మణిశంకర్‌కు చెందిన బెలూన్స్ అన్ లిమిటెడ్ షోరూంలో మంగళవారం సాయంత్రం అగ్ని ప్రమాదం సంభవించింది. అమలాపురం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. బెలూన్స్ డెకరేషన్ షోరూంతో పాటు గిఫ్ట్ షోరూం కూడా అగ్నికి ఆహుతయ్యింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ప్రమాదంలో రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని అగ్నిమాపక అధికారి కేవీ మురళీ కొండబాబు తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సామర్లకోట, మార్చి 5: కాకినాడ జిల్లా సామర్లకోట తహశీల్దార్ కార్యాలయం సమీపాన రాజీవ్ గృహ కల్ప సముదాయాల వద్ద ఒక ప్లాట్‌లో సుమారు 40 ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడాన్ని మంగళవారం సాయంత్రం స్థానికులు గుర్తించి సామర్లకోట పోలీసులకు సమాచారం అందించారు. ఇంటి తలుపులు మూసి ఉన్న ప్లాట్ నుంచి దుర్వాసన వస్తుండడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తలుపులు తెరిచి దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని సామర్లకోట పోలీసులు తెలిపారు.

## కుటుంబ కలహాల నేపథ్యంలో ఘర్షణ

**భార్య చెంపపై కొట్టిన భర్త..అక్కడికక్కడే మృతిచెందిన మహిళ**


మృతిచెందిన సాయిదీపిక

కొవ్వూరు, మార్చి 5: ఘర్షణ పడే క్రమంలో భర్త.. భార్య చెంపపై గట్టిగా కొట్టడంతో మృతిచెందింది. కొవ్వూరు మండలం మద్దూరులో ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మద్దూరుకు చెందిన సంద్ర వీరబాబుకు, అత్తిలి గ్రామానికి చెందిన లావణ్య సాయిదీపికతో 2010లో వివాహం జరిగింది. వీరికి కుమారుడు జయశంకర్, కుమార్తె కుందన ఉన్నారు. వీరబాబు తాపీ పనిచేస్తుంటాడు. మద్యం, పేకాట, కోడి పందాలకు బానిస కావడంతో భార్యాభర్తల మధ్య తరచూ డబ్బు విషయమై గొడవలు జరుగుతున్నాయి. మంగళవారం ఉదయం డ్వాక్రా రుణానికి సంబంధించిన వాయిదా డబ్బు చెల్లింపు విషయంలో ఇద్దరు ఘర్షణ పడ్డారు. ఈ కొట్లాటలో కోపంతో వీరబాబు భార్య చెంపపై గట్టిగా కొట్టాడు. దీంతో మాటలేకుండా లావణ్య కిందపడి మరణించింది. జరిగిన సంఘటనను వీరబాబు అత్తిలిలో ఉన్న అత్తమామలకు ఫోనులో తెలియజేయగా వారు హుటాహుటిన మద్దూరు రావడంతో లావణ్య చనిపోయిన విషయం బయటకు వచ్చింది. కొవ్వూరు డీఎస్పీ కె.రామారావు, సీఐ వి.శ్రీనివాసరావు, రూరల్ ఎస్ఐ కె.సుధాకర్ సంఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులు, బంధువుల నుంచి వివరాలు సేకరించారు. లావణ్య తల్లిదండ్రులు బడేటి గణపతి, వెంకటలక్ష్మి మాట్లాడుతూ వివాహం జరిగినప్పటి నుంచి తమ కుమార్తెను సరిగా చూసుకోలేదని, భర్తతోపాటు అత్త సంద్ర సూర్యకుమారి బాధలు పెడుతూనే ఉన్నారని, అన్యాయంగా తమ కుమార్తెను చంపేశారని ఆరోపించారు. తండ్రి ఫిర్యాదు మేరకు భర్త, అత్తపై హత్య కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

## భర్తపై కోపంతో ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నం

**రక్షించి కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు**



భార్యాభర్తలకు కౌన్సిలింగ్ ఇచ్చిన పోలీసులు

సామర్లకోట, మార్చి 5: కుటుంబ కలహాలు, భర్తపై కోపంతో కాకినాడ జిల్లా సామర్లకోటలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకునే ప్రయత్నం చేసిన ఒక మహిళను సామర్లకోట రైల్వే పోలీసులు రక్షించారు. సామర్లకోట మండలం వీకె రాయపురం గ్రామానికి చెందిన మల్లిరెడ్డి నాగలక్ష్మి భర్త మద్యానికి బానిసై పలువురి వద్ద అప్పులు చేస్తూ జల్సాలు చేయడంతో జీవితంపై విరక్తి చెందింది. దీంతో ఆత్మహత్య చేసుకునేందుకు సామర్లకోట రైల్వే స్టేషన్‌కు తన కుమార్తెతో సహా చేరుకుని పట్టాల వద్ద ఉండడాన్ని గమనించిన పల్స్ పోలియో సిబ్బంది సామర్లకోట రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. దీంతో రైల్వే పోలీసులు హుటాహుటిన స్పందించారు. సంఘటనా స్థలానికి చేరుకుని నాగలక్ష్మిని, ఆమె కుమార్తెను రక్షించారు. సమాచారం తెలుసుకుని భర్త శివదుర్గను స్టేషన్‌కు రప్పించి భార్యాభర్తలిద్దరికీ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. అనంతరం వారిని స్వగ్రామం అయిన వీకే రాయపురం పంపించారు.

## అనుమానాస్పద స్థితిలో ఒడిసా యువకుడి మృతి

అమలాపురం రూరల్, మార్చి 5: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ తాండవపల్లి రొయ్యల చెరువుల వద్ద పనిచేసేందుకు వచ్చిన ఒడిసా యువకుడు సంజయ్ కాటా (23) మంగళవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఒడిసాకు చెందిన నలుగురు యువకులు గత నెల 29న తాండవపల్లిలో రొయ్యల చెరువుల వద్ద పనిచేసేందుకు వచ్చారు. వారిలో సంజయ్ కాటా స్థానిక రైతు చొప్పల వీవీ నాగేశ్వరరావు వద్ద పనికి కుదిరాడు. ఈ నెల ఒకటో తేదీన మిత్రులతో కలిసి భోజనం చేస్తూ ఇక్కడ పనిచేయలేనని, ఉండలేకపోతున్నానని ఇంటికి వెళ్లిపోతానని చెప్పాడు. భోజనం చేసిన కొన్ని గంటల తర్వాత నుంచి సంజయ్ కనిపించలేదు. 2వ తేదీన చెరువుల యజమాని ఒడిసాలోని కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మీ అబ్బాయి ఇంటికి వచ్చారా అని ఆరా తీశారు. బిడ్డ ఇంటికి రాకపోవడంతో కంగారుపడ్డ కుటుంబ సభ్యులు తాండవపల్లి చేరుకుని ఆచూకీ కోసం వెతకడం ప్రారంభించారు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో చెరువు గట్టు పక్కన సంజయ్ మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. తాలూకా ఎస్ఐ కె.శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. సంజయ్ సోదరుడు అర్జున్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## వేర్వేరు రైలు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తుల మృతి

తుని రూరల్, మార్చి 5: కాకినాడ జిల్లా తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు చోట్ల జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. తుని రైల్వేస్టేషన్‌కు దగ్గరలో లింగాలకాలనీ వద్ద రైలు పట్టాలపై మృతదేహం లభ్యమైందని, వివరాలు తెలియరాలేదని ఎస్ఐ తెలిపారు. అదే విధంగా తిమ్మాపురం రైల్వేస్టేషన్ సమీపంలో బెంగళూరు నుంచి జార్ఖండ్ వెళుతున్న గుర్తు తెలియని ప్రయాణికుడు రైలు నుంచి జారి పడటంతో తీవ్ర గాయాలపాలయ్యాడన్నారు. 108 సహాయంతో ఏరియా ఆసుపత్రికి తరలించివైద్యం అందించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండు ఘటనపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచి బంధువులకు సమాచారం ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలి


సమీక్ష నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్, ఏఎస్పీ

రంపచోడవరం, మార్చి 5: మహా శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టాలని సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. సబ్ కలెక్టరు కార్యా లయంలో ఆయన ఏఎస్పీ జగదీష్ అడహళ్లితో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టరు మాట్లాడుతూ ఐదు రోజుల ఉత్సవాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలన్నారు. ఏఎస్పీ మాట్లాడుతూ శివాలయాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, కమిటీ సభ్యులు అందుబాటులో ఉండి సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, డీఎల్‌పీవో రాఘవన్, ఎంపీడీవో హరికృష్ణ, తహశీల్దార్లు సత్య నారాయణ, చలపతిరావు, డీటీ బి.రాజు, సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్‌రావు, ఆర్టీసీ డీఎం రమణ పాల్గొన్నారు.

## ఏర్పాట్లపై ఏఎస్పీ ఆరా

చింతూరు, మార్చి 5: మహా శివరాత్రి వేడుకల నిర్వహణపై చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా మంగళవారం సమీక్ష నిర్వహించారు. వీరాపురం శివలింగం వద్దకు ప్రతి ఏటా ఛత్తీస్‌గఢ్, ఒడిసా, తెలంగాణ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తారు. దీంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని శివరాత్రి వేడుకల నిర్వహణ కమిటీకి సూచించారు. కార్యక్రమంలో సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# కాకినాడ





## ఓటు హక్కుపై అవగాహన

గండేపల్లి, మార్చి 5: సూరంపాలెంలోని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో జేఎన్టీయూకే ఆదేశాల మేరకు తమ దత్తత గ్రామాల్లో ఆనూరు, కొత్తపల్లి గ్రామాల్లో మంగళవారం ప్రజలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వి.సత్యనారాయణ, బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కాకినాడలో కేంద్ర పోలీసు బలగాలు, సామర్లకోటలో కవాతు ప్రదర్శన

## కేంద్ర పోలీసు బలగాల కవాతు

కాకినాడ సిటీ, మార్చి 5: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో మంగళవారం కేంద్ర పోలీస్ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. కాకినాడ కలెక్టరేట్ ఏరియా, జిల్లా పరిషత్ సెంటర్ సినిమారోడ్, రెవెన్యూ కాలనీ తదితర ప్రాంతాల్లో పోలీసు దళాలు, జిల్లా పోలీసులు కవాతు నిర్వహించారు. ఎన్నికల విధులపై వచ్చిన కేంద్ర బలగాలు ఆయా ప్రాంతాలపై అవగాహన కల్పించారు.

**సామర్లకోట:** రానున్న ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ప్రతీ ఓటరూ తన ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకునేలా ఆత్మస్థైర్యాన్ని కల్పించేందుకు కేంద్ర సాయుధ బలగాలు సామర్లకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో, మండలంలోని వేట్లపాలెం, హుస్సేన్‌పురం తదితర గ్రామాల్లో మంగళవారం కవాతు ప్రదర్శన నిర్వహించారు. కేంద్ర సాయుధ బలగాల వెంట సామర్లకోట ఎస్‌హెచ్‌వో తదితరులు పాల్గొన్నారు.

## 'కాపుల అభ్యున్నతికి ప్రాధాన్యం'

పిఠాపురం, మార్చి 5: కాపుల అభ్యున్నతికి ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఎస్వీఎస్ఎన్ వర్మ ఎమ్మెల్యేగా ఉండగా నియోజకవర్గంలో 27 కాపుల కల్యాణమండపాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారని పిఠాపురం నియోజకవర్గ టీడీపీ కాపు నాయకులు తెలిపారు. వారు పిఠాపురం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని కాపులంతా వర్మ వెన్నంటే ఉన్నారని, కాపుల ఐక్యతను చాటిచెప్పేందుకు బుధవారం పిఠాపురం మున్సిపల్ కార్యాలయం సమీపంలోని పాత టీడీపీ కార్యాలయ ఆవరణలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. నియోజకవర్గంలోని కాపు సోదరులంతా హాజరై వర్మకు సంఘీభావం తెలియజేయాలని కోరారు. టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు రెడ్డెం భాస్కరరావు, సకుమళ్ల గంగాధర్, ఉలవకాయల దేవేంద్రుడు, నాయకులు దేవరపల్లి రామారావు, కొండేపూడి సూర్యప్రకాష్, నామా దొరబాబు, సోము సత్యనారాయణ, అల్లవరపు నగేష్, సూరవరపు సుబ్బారావు, బస్వా సత్యనారాయణ, వోగేటి మురళీ తదితరులు పాల్గొన్నారు.

## మహిళల స్వయం ఉపాధికి కుట్టుమిషన్లు

సర్పవరం జంక్షన్, మార్చి 5: మహిళల స్వయం ఉపాధికి కుట్టుమిషన్లు ఎంతగానో దోహదపడతాయని జిల్లా బాలల సంక్షేమ అధికారి, వాకర్స్ జిల్లా కౌన్సిలర్ అడబాల రత్నప్రసాదరావు అన్నారు. మంగళవారం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో కొప్పిశెట్టి సురేష్‌అనిత దంపతుల 25వ వివాహ వార్షికోత్సవం పురస్కరించుకుని టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 25 మంది మహిళలకు రూ. 1.75 లక్షల విలువైన కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. సురేష్ దంపతులను అభినందించి ట్రస్ట్ ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం వృద్ధులకు భోజన ప్యాకెట్లు, స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గల్లా సుబ్బారావు, అడబాల సత్యనారాయణ, బి.సత్యనారాయణరాజు, ఎస్.శ్రీనగేష్, ప్రసనన, శ్రీవాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

## జనసేన మీడియా హెడ్‌ని కలిసిన జగ్గంపేట నేతలు

జగ్గంపేట, మార్చి 5: నియోజకవర్గ జనసేన నేతలను మంగళవారం పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మీడియా హెడ్ హరిప్రసాద్ పిలిచి నియోజకవర్గ పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి బాలు, నియోజకవర్గ ఐటీ కోఆర్డినేటర్ ఆరినే రాజేష్, నాయకుడు పాలిశెట్టి సతీష్, కిర్లంపూడి మండలాధ్యక్షుడు ఉలిసి అయిరాజు, జగ్గంపేట మండల ఐటీ కోఆర్డినేటర్ సూరపురెడ్డి నరేష్, కిర్లంపూడి మండల చిరంజీవి యువత అధ్యక్షులు ఎలుబండి శివ, గోకవరం మండల ఉపాధ్యక్షులు గవిని దుర్గాప్రసాద్, జగ్గంపేట మండలం చిరంజీవి యువత అధ్యక్షులు మద్దూరి ప్రసాద్, జగ్గంపేట టౌన్ అధ్యక్షులు గవర సుధాకర్, గ్రామధ్యక్షులు, జనసేన సైనికులు పాల్గొన్నారు.

## 'బకాయి వేతనాలు తక్షణం చెల్లించాలి'

కాకినాడ సిటీ, మార్చి 5: సమగ్ర శిక్షలో పనిచేసే కాంట్రాక్ట్ ఉద్యోగుల రెండు నెలల బకాయి వేతనాలు తక్షణం చెల్లించాలని, సమ్మె సమయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీల జీవోలు వెంటనూ జారీ చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దువ్వా శేషబాబ్జి, చెక్కల రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం వారు మీడియాతో మాట్లాడుతూ సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల 21రోజుల సమ్మె సందర్భంగా విద్యాశాఖ మంత్రి స్టేట్ పీడీ ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరిస్తూ ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. 2 నెలలు గడుస్తున్నా హెచ్‌ఆర్ పాలసీ కమిటీని ఇంతవరకు నియమించలేదని, హామీల మేరకు తక్షణం ఆదేశాలు జారీ చేయాలన్నారు.

## 'బహుజన వర్గాల రాజ్యం రావాలి'

తుని రూరల్, మార్చి 5: రాష్ట్రంలో బహుజన వర్గాల రాజ్యం రావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి.పరంజ్యోతి అన్నారు. హంసవరం గ్రామంలో నియోజకవర్గ ఇన్‌చార్జ్ టి.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన పరంజ్యోతి మాట్లాడుతూ బీఎస్పీతోనే బడుగు, బలహీన వర్గాల సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి సిద్ధమవుతున్న కిరణ్‌కుమార్‌కు మద్దతుగా నిలబడి ఆశీర్వదించాలన్నారు.

## ఆర్యవైశ్య సత్రం గౌరవాధ్యక్షుడిగా రాపాక

అన్నవరం, మార్చి 5: అరుణాచలం ఆర్యవైశ్య సత్రం గౌరవాధ్యక్షుడిగా అన్నవరం వాసవీసత్రం కార్యదర్శి రాపాక రామసత్యనారాయణను నియమిస్తూ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అరుణాచలం ఆర్యవైశ్య సత్రం నూతనంగా నిర్మితమవుతుందని త్వరలోనే ప్రారంభంకానున్న నేపథ్యంలో అరుణాచలం దర్శనానికి విచ్చేసే భక్తులకు సేవలందిస్తానని రామసత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు వాసవీసత్రం అధ్యక్షులు పేరూరి గాంధీ తదితరులు అభినందనలు తెలిపారు.

## హైకోర్టు తీర్పుపై ఐలాజ్ ప్రతినిధుల హర్షం

ప్రత్తిపాడు, మార్చి 5: ప్రొఫెసర్ సాయిబాబాను విడుదల చేస్తూ బొంబే హైకోర్టు మంగళవారం ఇచ్చిన తీర్పుపై ఐలాజ్ ప్రతినిధులు బుగతా శివ, అవసరాల దేవి హర్షం వ్యక్తం చేశారు. ప్రత్తిపాడులో వారు మాట్లాడుతూ సాయిబాబా విడుదల శుభపరిణామన్నారు. భీరేగాం కుట్రలో సాయిబాబాకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయనే ఎన్ఐఏ ఆరోపణలో వాస్తవాలు లేవని హైకోర్టు తీర్పు ఇచ్చిందని చెప్పారు.

## సీఎస్‌సీ అకాడమీతో ఒప్పందం

పెద్దాపురం, మార్చి 5: మండలంలోని దివిలి కిట్స్ మహిళా ఫార్మసీ కళాశాల సీఎస్‌సీ అకాడమీ (విశాఖపట్టణం)తో పరస్పర ఉపాధి శిక్షణా నైపుణ్యం అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నటట్టు కళాశాల చైర్మన్ బేతినీడి శ్రీనివాసరావు తెలిపారు. సీఎస్‌సీ అకాడమీ సలహాదారు వై.రామ్మోహన్, కళాశాల ప్రిన్సిపాల్ గుడిపాటి మధు పరస్పరం ఈ ఒప్పంద పత్రాలను మార్చుకున్నట్టు చెప్పారు. రీసెర్చ్ అండ్‌డవలప్‌మెంట్ సీనియర్ అడ్వైజర్ డాక్టర్ మురళీకృష్ణ, జెన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

## సారా స్వాధీనం

ప్రత్తిపాడు, మార్చి 5: ప్రత్తిపాడు సెబ్ అధికారులు అప్పన్నపాలెం, ఒమ్మంగి గ్రామాల్లో మంగళవారం దాడులు నిర్వహించి 70లీటర్ల సారాతో పాటు మోటార్ బైక్ స్వాధీన పరుచుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. ఏలేశ్వరం మండలం అప్పన్నపాలెంలో బైక్‌పై 50లీటర్ల సారా తరలిస్తున్న అన్నంశెట్టి పాపారావు, ఒమ్మంగిలో 20లీటర్ల సారాతో నూకల చిన్నబాబును అరెస్ట్ చేశారు. అప్పన్నపాలెంలో 800లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో సెబ్ సీఐ ఎల్.చిరంజీవి, ఎస్ఐ. ఎం.ఆశలత, కానిస్టేబుల్స్ వెంకన్నదొర, కృష్ణార్జున, దొరబాబు, రాజు, రాంబాబు, సలాం తదితరులు పాల్గొన్నారు.

**తుని రూరల్:** నాటుసారా స్థావరాలపై ఎస్ఈబీ పోలీసులు దాడులు చేపట్టారు. తొండంగి మండలం తాటిఆకులపాలెం గ్రామంలో 4500 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 95లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌హెచ్‌వో చిట్టిబాబు తెలిపారు.

## సినిమా గైడ్

**కాకినాడ**

ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్: ఆపరేషన్ వాలెంటైన్, భూతద్ద భాస్కర్, చారి 111, కిక్, ఊరు పేరు భైరవకోన

దేవీ మల్టీప్లెక్స్ 4 స్క్రీన్స్: ఆపరేషన్ వాలెంటైన్, భూతద్ద భాస్కర్, చారి 111, కిక్, ఊరు పేరు భైరవకోన

| | |
|---|---|
| తిరుమల | : అంబాజీపేట మ్యారేజిబ్యాండు |
| లక్ష్మి | : ఆపరేషన్ వాలెంటైన్ |
| సీ అండ్‌సీ1 | : హనుమాన్ |
| సీ అండ్‌సీ2 | : ఆపరేషన్ వాలెంటైన్ |
| శ్రీప్రియ | : సుందరంమాస్టర్ |
| పద్మప్రియ | : ఆపరేషన్ వాలెంటైన్ |
| సత్యగౌరి | : భూతద్దం భాస్కర్ |
| సూర్య 1 | : ఆపరేషన్ వాలెంటైన్ |
| సూర్య 2 | : కిక్ |

## ఇళ్ల పట్టాల పంపిణీ

సర్పవరం జంక్షన్, మార్చి 5: కాకినాడ రూరల్ సర్పవరం ఆటోనగర్‌లో డీజీబీ ఫంక్షన్ హాల్లో మంగళవారం గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు శీలం నాగేశ్వరరావు, పుల్ల ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ చేసిన ఇంటి స్థల బదలాయింపు దస్తావేజు పత్రాలను ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పంపిణీ చేశారు. పుల్ల చందూ, పుల్ల కోటేశ్వరరావు, ఎంపీటీసీలు గుత్తుల శ్రీనివాసరావు, ఎస్ రాజేష్, గ్రామ కార్యదర్శి సత్యనారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ, జనసేన కూటమితోనే అభివృద్ధి



టీడీపీలో చేరినవారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

» ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

పెద్దాపురం, మార్చి 5: టీడీపీ, జనసేన కూటమితోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన పట్టణంలో స్థానిక దర్గాసెంటర్ నుంచి డైలీమార్కెట్, మెయిన్ రోడ్డు, వెంకటేశ్వరస్వామి ఆలయం, దర్గాసెంటర్ మీదుగా మంగళవారం ప్రచారాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి దూమైపోయిందని, రాష్ట్రం పూర్తిగా తిరోగమనంలోకి వెళ్లిపోయిందన్నారు. ఇప్పటికే వైసీపీని ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేయడమే లక్ష్యంగా వైసీపీ పని పెట్టుకుందన్నారు. అనంతరం టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ఆయన ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజాసూరిబాబురాజు, నిమ్మకాయల రంగనాగ్, మన్యం దేవబాబు, పేకేటి దొరబాబు, అరిఫ్ ఆలీ, తూతిక రాజు, కొరిపూరి రాజు, అధిక సంఖ్యలో టీడీపీ నేతలు పాల్గొన్నారు.

### టీడీపీలోకి చేరికలు

పట్టణానికి చెందిన పలువురు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. మైనారిటీ సంఘ నేత మహ్మద్ లాయక్ ఆలీ తన అనుచరులతో కలిసి మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఎమ్మెల్యే చినరాజప్ప పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీలో తగిన గుర్తింపు లభించకపోవడం కారణంగానే తాము టీడీపీలోకి చేరినట్టు తెలిపారు.

## మైనార్టీలకు ఇచ్చే గౌరవమిదేనా?

ప్రశ్నించిన డీసీసీబీ డైరెక్టరు మొహిద్దీన్



వేదికపైకి ఆహ్వానించకపోవడాన్ని ప్రశ్నిస్తున్న మొహిద్దీన్

పిఠాపురం, మార్చి 5: తనను వేదికకు పైకి ఆహ్వానించకపోవడంపై డీసీసీబీ డైరెక్టర్ సయ్యద్ మొహిద్దీన్ ఆవేదన వ్యక్తం చేశారు. మైనార్టీలకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ ప్రశ్నించారు. గొల్లప్రోలు పట్టణంలోని ఒక పంక్షన్‌హాలులో మంగళవారం నిర్వహించిన పిఠాపురం నియోజకవర్గ స్థాయి వైసీపీ పోలింగ్‌బూత్ కన్వీనర్ల సమావేశంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ సమావేశంలో కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, కాకినాడ లోక్‌సభ నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త చలమలశెట్టి సునీల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి పిఠాపురం ఎమ్మెల్యే పెండెం దొరబాబు హాజరు కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. సమావేశంలో గీత, సునీల్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలని, ప్రతి ఇంటికి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలపై వారికి వివరించాలని సూచించారు.

## 'అధికారంలోకి టీడీపీ, జనసేన'



బాబుష్యూరిటీ బాండ్లను పంచుతున్న టీడీపీ నేతలు

తాళ్లరేవు, మార్చి 5: రాబోవు రోజుల్లో టీడీపీ,జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి రానుందని.. దగా చేసిన మోసగాడి ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని టీడీపీ ప్రధాన కార్యదర్శి కట్టా త్రిమూర్తులు అన్నారు. మంగళవారం చొల్లంగి గ్రామంలో బాబుష్యూరిటీ- భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజలంతా టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వానికి పట్టం కట్టాలని కోరారు. పలువురు యువకులు పాల్గొన్నారు.

## మంగళగిరి తరలిన బీసీ నాయకులు



గండేపల్లి, మార్చి 5: మంగళగిరిలో మంగళవారం నిర్వహించిన జయహో బీసీ సభకు టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహన్‌రావు ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో బీసీ నాయకులు తరలివెళ్లారు. బస్సును మోహన్‌రావు జెండా ఊపి ప్రారంభించారు. తంగిరాల అప్పారావు, పైలా వెంకన్న, తణుకు దుర్గారావు, బుగతా నూకరాజు, గొల్లవిల్లిరాజు ఉన్నారు.

## సాగునీరందించడంలో ప్రభుత్వం విఫలం

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ



గొల్లప్రోలులో కరపత్రాలు అందజేస్తున్న వర్మ

గొల్లప్రోలు, మార్చి 5: దాళ్వా సాగుకు అవసరమైన నీటిని అందించడంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ విమర్శించారు. గొల్లప్రోలు 19,20వ వార్డుల్లో మంగళవారం సాయంత్రం శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాల క్యాలెండర్‌లను అందజేశారు. పురుషోత్తపట్టణం ఎత్తిపోతల పథకం ద్వారా తాము 2 పంటలకు పుష్కలంగా నీరు అందించేవారమని వర్మ తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరెంటు చార్జీలు చెల్లించకుండా సదరు పథకాన్ని మూలనపెట్టిందని దాని వల్లే సాగునీటి ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, నగరపంచాయతీ మాజీ చైర్మన్ శీరం మాణిక్యం, బస్వా సత్యనారాయణ ఉన్నారు.

### 'అండగా నిలవాలి'

పిఠాపురం రూరల్, మార్చి 5: ప్రజల కష్టసుఖాల్లో వెన్నంటి ఉన్న పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు అండగా నిలవాలని వర్మ సతీమణి లక్ష్మీదేవి కోరారు. పిఠాపురం మండలం కోలంక గ్రామంలో శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను అందజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, నాయకులు ఎలుబండి రాజారావు, బాబులు, బర్ల అప్పారావు, మలిరెడ్డి వెంకటరమణ, సకుమళ్ల నాగబాబు, నంద్యాల నాగబాబు, వెంకటరమణ పాల్గొన్నారు.

## టీడీపీ-జనసేన అధికారంలోకి వచ్చేలా కృషి



జనసేనలోకి పలువురిని ఆహ్వానిస్తున్న నానాజీ

భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్

సర్పవరం జంక్షన్, మార్చి 5: రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా సమష్టిగా కృషి చేయాలని భీమిలి టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ పంచకర్ల సందీప్ కోరారు. మంగళవారం నేమాం, వలసపాకల గంగరాజునగర్ జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నేమాం మాజీ సర్పంచ్ ఇంజరపు సుబ్బారాయుడు 15 మంది అనుచరులు, ఇంద్రపాలెం నుంచి బొల్లే భవాని శంకర్ ఆధ్వర్యంలో సుమారు 60 మందితో జనసేనలో చేరారు. వారికి జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థి పంతం నానాజీ, సందీప్ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల భవిష్యత్తు, అభివృద్ధి కోసం ఇరుపార్టీల అధినేతలు పవన్, చంద్రబాబు చారిత్రకంగా పొత్తు పెట్టుకున్నారన్నారు. రాక్షస పాలన అంతం కోసం అధినేతల ఆదేశాల మేరకు రాబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా సమష్టిగా ఇరుపార్టీల నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు రాందేవు సీతయ్యదొర, కరెడ్ల గోవిందు, దాసరి శివ, పోసిన రాము, పుల్ల శ్రీరాములు, చైర్మన్ శ్రీను తదితరులు ఉన్నారు.

## 'మహిళలు ప్రత్యేక గుర్తింపు కలిగి ఉండాలి'



సంధ్యారాజును సత్కరిస్తున్న దృశ్యం

కాకినాడ కల్చరల్, మార్చి 5: ప్రతి మహిళ సమాజంలో ప్రత్యేక గుర్తింపు కలిగి ఉండాలని సినీ నటి, జాతీయ కూచిపూడి నృత్య కళాకారిణి బైర్రాజు సంధ్యారాజు అన్నారు. జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని క్షత్రియ మహిళా విభాగం ఆధ్వర్యంలో గాంధీనగర్ క్షత్రియ పరిషత్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ సొంత గుర్తింపుతోనే మహిళా సాధికారిత సాధ్య మవుతుందన్నారు. క్షత్రియ పరిషత్ మహిళా విభాగం అధ్యక్షకార్యదర్శులు పెన్మెత్స పార్వతి, ఇందుకూరి దేవివర్మ ఆధ్వర్యంలో సంధ్యారాజును సత్కరించారు. పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు అద్దూరి రామకృష్ణ భాస్కరరాజు, వేగేశ్నవర్మ పాల్గొన్నారు.


## పిఠాపురంలో కారు దగ్ధం



పిఠాపురం, మార్చి 5: పార్కు చేసిన కారు మంటల్లో చిక్కుకుని దగ్ధమైంది. పట్టణంలోని పల్లపువీధిలోని ఒక ఇంటి వద్ద కారును పార్కు చేసి ఉంచారు. మంగళవారం కారుకు ఆకస్మికంగా మంటలు అంటుకున్నాయి. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. మతిస్థిమితం లేని బాలుడు ఆడుకుంటూ కాగితాలకు నిప్పుపెట్టడంతో ప్రమాదం జరిగినట్టుభావిస్తున్నారు.

## జనసేన మేము సిద్ధం

కార్పొరేషన్ (కాకినాడ), మార్చి 5: స్థానిక 6వ డివిజన్ రేచర్లపేట హనుమాన్ ఆలయ ప్రాంతంలో దళితుల సంక్షేమ పథకాలను తీసేసిన జగన్‌పై జనసేన మేము సిద్ధం కార్యక్రమం పార్టీ సిటీ ఇన్‌చార్జి ముత్తా శశిధర్ ఆధ్వర్యంలో డివిజన్ అధ్యక్షుడు పచ్చిపాల కోడిశ్రీను అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో కాంటా రవిశంకర్, చింతకాయల చిన్ని, బంగారు శ్రీను, పచ్చిపాల మధు, చిన్న అంజి పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడతున్న ముత్తా శశిధర్

## పన్నుల వసూళ్ల వేగవంతం

మున్సిపల్ ఆర్డీ సత్యనారాయణ



పన్నుల వసూళ్లపై సమీక్షిస్తున్న ఆర్డీ

గొల్లప్రోలు, మార్చి 5: ఆస్తి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని పురపరిపాలన శాఖ రీజనల్ డైరెక్టరు ఎన్‌వీవీ సత్యనారాయణ ఆదేశించారు. ఆయన మంగళవారం గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. పన్నుల వసూళ్లపై సమీక్షించారు. పన్నుల వసూళ్లలో వెనకబడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కొందరు ఉద్యోగుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. నగరపంచాయతీ కమిషనరు రవికుమార్, మేనేజరు రాంప్రసాద్ పాల్గొన్నారు.

## 'ఆదర్శవంతంగా నిర్వహించాలి'



భవితకేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న నాగేశ్వరావు

తొండంగి, మార్చి 5: దివ్యాంగుల కోసం ఏర్పాటైన భవిత కేంద్రాలను ఆదర్శవంతంగా నిర్వహించాలని కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి చామంతి నాగేశ్వరావు సూచించారు. మంగళవారం ఆయన తొండంగి భవిత కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించి దివ్యాంగులకు అందుతున్న బోధనాభ్యసన కృత్యాలను పరిశీలించారు. విద్యార్థులకు వారివారి స్థాయిలను అనుసరించి బోధించాలన్నారు. అనంతరం ఆయన ప్రాథమిక పాఠశాలలను సందర్శించి జగనన్న విద్యా కానుక వినియోగంపై ఆరా తీశారు. ఎంఈవో2 సుబ్బిరెడ్డి, ఐఈఆర్టీలు జగన్నాథం, నాగేశ్వరావు, సీఆర్పీ ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

## 'మూల్యం చెల్లించుకోక తప్పదు'

తాళ్లరేవు, మార్చి 5: పేదల సమస్యలను పట్టించుకోకుండా వైసీపీ ప్రభుత్వం ఏకపక్షంగా పోతుందని, రాబోవు రోజుల్లో మూల్యం చెల్లించుకోక తప్పదని ఇళ్ల స్థలాల లబ్ధిదారులు హెచ్చరించారు. చొల్లంగిలో 35రోజులుగా మహిళలు ఇళ్ల స్థల పట్టాల కోసం నిరసన తెలపుతున్నారు. మంగళవారం అల్లం వీరలక్ష్మి, దడాల రాజేశ్వరి, అల్లం లక్ష్మి పాల్గొన్నారు.

## బీజేపీ ప్రజా పోరుయాత్ర

ప్రత్తిపాడు, మార్చి 5: మండలంలోని పోతులూరులో మంగళవారం బీజేపీ ప్రచార ప్రజా పోరుయాత్ర నిర్వహించింది. ఆ పార్టీ మండలాధ్యక్షుడు కందా వీరాస్వామి, జిల్లా నేత చింతాకుల రామకృష్ణ, నియోజకవర్గ విస్తారక్ యార్లగడ్డ వెంకటరాయుడు, ఇంటి బాబురావు హాజరై కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సంక్షేమ అభివృద్ధి పథకాల క్యాలెండర్, పోస్టర్లు పంపిణీ చేశారు. బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాగులాపల్లిలో 'గడపగడపకు'

నాగులాపల్లి (కొత్తపల్లి), మార్చి 5: నాగులాపల్లిలో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గ్రామ సర్పంచ్ వడిశెట్టి గౌరీ రాజేశ్వరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కాకినాడ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్ గ్రామంలోని వీధుల్లో పర్యటించారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని పలువురు ఆమెను కోరారు.

## ఆలయ అభివృద్ధికి నిధుల మంజూరు

సర్పవరం జంక్షన్, మార్చి 5: కాకినాడ రూరల్ పి. వెంకటాపురంలో శ్రీలక్ష్మి గోదాదేవి సమేత శ్రీఐశ్వర్య వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి పనులకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ అనుసూరి తాతబ్బాయి, ఈవో తెలిపారు. కాకినాడ రూరల్‌తో పాటూ జిల్లాలో గల పలు దేవాలయాల అభివృద్ధి పనుల కోసం ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించినట్టు తెలిపారు.

## విద్యార్థులకు పెన్నుల పంపిణీ

కాకినాడ కల్చరల్, మార్చి 5: పదో తరగతి పరీక్షల్లో విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. మెయిన్‌రోడ్ వినాయకుని ఆలయంలో స్వామివారి వద్ద పెన్నులు, పరీక్ష అట్టలు ఉంచి పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో శివబాబు పాల్గొన్నారు.